

చిత్ర కళాప్రదర్శన ప్రారంభం

ఏఎన్‌యూ: చిత్ర కళాప్రదర్శన మంగళవారం ప్రారంభమైంది. వీసీ పి.రాజశేఖర్, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్, కల్చరల్ కమిషన్ సీఈఓ మల్లికార్జునరావు ప్రదర్శనను తిలకించారు.




సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 4012 క్యూసెక్కులు విడుదల చేశారు.

అన్నపూర్ణాదేవిగా భువనేశ్వరి

నరసరావుపేట రూరల్: కోటప్పకొండలోని భువనేశ్వరి సమేత నీలకంఠేశ్వర స్వామి దేవస్థానంలో దసరా నవరాత్రుల్లో భాగంగా అమ్మవారు మంగళ వారం అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శన మిచ్చారు.



న్యూస్‌రీల్

గాయత్రీదేవిగా బాలచాముండేశ్వరి



అమరావతి: అమరావతి బాలచాముండిక సమేత అమరేశ్వరాలయంలో శ్రీదేవీ శరన్నవ రాత్రి మహోత్సవాలలో భాగంగా మంగళవారం బాల చాముండేశ్వరి అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించారు. సహస్ర కుంకుమార్చన, దేవి ఖడ్గమాల, త్రిశల, లలితా సహస్రనామార్చన, శ్రీచక్రార్చనతోపాటుగా గాయత్రీదేవికి సంధ్యా సమయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని జ్వాలాముఖి, మహిషాసురమర్దని అమ్మవార్లకూ ప్రత్యేక పూజలు చేశారు. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. సీతాసమేత కోదండరామస్వామి దేవస్థానంలోని అద్దాలమహల్‌లో వాసవీ కన్యకాపరమేశ్వరి అలంకారం చేశారు.

ఎన్నికల సామగ్రి సిద్ధం చేసే ప్రక్రియ ప్రారంభం

తనిఖీ చేసిన కలెక్టర్ శివశంకర్



నరసరావుపేట: ఈవీఎం, వీవీ ప్యాట్ల మొదటి దశ తనిఖీ ప్రక్రియను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శివశంకర్ లోతేటి మంగళవారం పరిశీలించారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్‌లో సోమవారం నుంచి ఎన్నికలలో వినియోగించే సామగ్రిని పరీక్షించి సిద్ధంచేసే ప్రక్రియ ప్రారంభమైన విషయం తెలిసిందే. అక్కడ ఏర్పాటు చేస్తున్న ప్రథమ చికిత్సా కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలు అందజేశారు. అలాగే సిబ్బందికి అందిస్తున్న భోజన వసతిని పరిశీలించారు. సిబ్బంది హాజరు వివరాలు సేకరించి, హాజరు పట్టికను పరిశీలించారు. సిబ్బంది సెల్ ఫోన్లను భద్రపరిచే గదిని తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట గోడౌన్ ఇన్‌చార్జి, డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్, మండల రెవెన్యూ అధికారి ఆర్‌వీ రమణానాయక్ ఉన్నారు.

ప్రథమస్థానంలో తెనాలి ఆర్టీసీ డిపో

గుంటూరు రీజనల్ మేనేజర్ పి.రవికాంత్



తెనాలిఅర్బన్: ఆదాయాన్ని సమకూర్చే విషయంలో జోన్‌లోనే తెనాలి ఆర్టీసీ డిపో ప్రథమ స్థానంలో ఉందని గుంటూరు రీజనల్ మేనేజర్ పి.రవికాంత్ పేర్కొన్నారు. తెనాలి డిపోను మంగళవారం ఆయన పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం ఉద్యోగులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో తెనాలి రాష్ట్ర స్థాయిలో మంచి స్థానంలో ఉండేలా చూడాలని సూచించారు. డిపోలో మరిన్ని వసతులు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఉద్యోగులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఎస్‌బీఐ రూపే కార్డులను అందరూ కలిగి ఉండాలని చెప్పారు. అనంతరం లక్ష్యాలు సాధించిన ముగ్గురు కండక్టర్లకు క్యాష్ అవార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

నేటి నుంచి వర్సిటీ వసతి గృహాలకు సెలవులు

ఏఎన్‌యూ(గుంటూరు): యూనివర్సిటీ కళాశాలలకు దసరా సెలవులు ఇవ్వడంతో వసతి గృహాలకు బుధవారం సాయంత్రం నుంచి సెలవులు ప్రకటించారు. పీజీ బాలుర, బాలికల హాస్టళ్లను ఈనెల 25 మధ్యాహ్నం నుంచి, ఇంజినీరింగ్ కళాశాల వసతి గృహాన్ని ఈనెల 26 మధ్యాహ్నం నుంచి తిరిగి ప్రారంభిస్తామని బాలుర, బాలికల వసతి గృహాల చీఫ్ వార్డెన్లు ప్రొఫెసర్ జి.నాగరాజు, ప్రొఫెసర్ వి.వెంకట రత్నమ్మ, ప్రొఫెసర్ పి.సిద్దయ్య తెలిపారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయల కనిష్ఠ ధర రూ.2,000, గరిష్ఠ ధర రూ.3,200, మోడల్ ధర రూ.2,500 వరకు పలికింది.

రికార్డు స్థాయిలో జారీ

- రవాణాశాఖ కార్డులొచ్చేస్తున్నాయి
- కొన్ని నెలలుగా మందగించిన ఆర్సీ, డీఎల్ కార్డుల ప్రింటింగ్
- జిల్లాలో 81,791 కార్డుల పెండింగ్
- ప్రభుత్వ ఆదేశాలతో జోరుగా సాగుతున్న ముద్రణ
- నెల రోజుల్లో 15,977 కార్డుల మంజూరు
- మిగిలినవీ మూడు నెలల్లో పూర్తి చేసేలా లక్ష్యం

సాక్షి, నరసరావుపేట: రవాణాశాఖ డ్రైవింగ్ లైసెన్స్ (డీఎల్), వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్(ఆర్సీ) కార్డుల జారీ ఊపందుకుంది. రికార్డుస్థాయిలో కార్డుల ముద్రణ ప్రక్రియ సాగుతోంది. కొన్ని నెలలుగా కార్డుల ముద్రణ మందగించిన నేపథ్యంలో వాహనదారులు వాటి కోసం నిరీక్షిస్తున్నారు. దీంతో ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న కార్డులను వెంటనే వాహనదారులకు అందజేయాలని ఆదేశాలిచ్చింది. దీంతో రికార్డుస్థాయిలో కార్డుల జారీకి రవాణాశాఖ చర్యలు చేపట్టింది. పల్నాడు జిల్లాలో 81,791 కార్డులు పెండింగ్‌లో ఉండగా ఇందులో 54,378 ఆర్సీ, 27,413 డీఎల్ కార్డులు ఉన్నాయి. నెల రోజులుగా నరసరావుపేట రవాణాశాఖ కార్యాలయంలో రెండు ప్రత్యేక ప్రింటర్లను ఏర్పాటు చేసి కార్డులు ముద్రిస్తున్నారు. ప్రింటర్లు గంటకు 40–50 కార్డులు ముద్రిస్తున్నాయి.



ఆర్సీ, డీఎల్ కార్డులు ప్రింట్ చేసే మిషన్



పంపిణీకి సిద్ధంగా ఉన్న కార్డులు

15,977 కార్డులు పంపిణీ

నెల రోజుల కాలంలో 15,977 కార్డులు ముద్రించి పోస్టల్ శాఖ ద్వారా వాహనదారుల ఇళ్లకు పంపే ఏర్పాట్లు చేశారు. ఇందులో 10,700 ఆర్సీ, 5,277 డీఎల్ కార్డులు ఉన్నాయి. జిల్లాలో ఇంకా 43,678 ఆర్సీ, 22,136 డీఎల్ కార్డులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని మరో మూడు నెలల్లోగా ముద్రించి పంపిణీ చేసేలా రవాణాశాఖ కృషి చేస్తోంది. ఈ నిర్ణయంతో వాహనదారుల ఇబ్బందులు తీరనున్నాయి. అప్పటివరకు ట్రాఫిక్ పోలీసులు తనిఖీ సమయంలో డిజిటల్ రూపంలో ఉన్న కార్డులను చూపవచ్చని రవాణాశాఖ అధికారులు చెబుతున్నారు.

ఇకపై డిజిటల్ రూపంలోనే...

కొత్త నిబంధనల ప్రకారం ఇకపై డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీలను డిజిటల్ రూపంలో జారీ చేయనుంది. ఇకమీదట వాహనదారులు ఆర్టీఓ కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం లేదు. మనుపటిలా కార్డు జారీకి ఫీజు చెల్లించాల్సిన పని కూడా లేదు. ఇప్పటి వరకు డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ కార్డుల కోసం రూ.200, పోస్టల్ చార్జీ కింద మరో రూ.25 చొప్పున రవాణా శాఖ వసూలు చేస్తోంది. ఇక వాహనదారులు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ రూపొందించిన sarathiparivahan.gov.in వెబ్ సైట్‌లోకి వెళ్లి దరఖాస్తు చేసుకుంటే సరిపోతుంది. నిర్దీత వ్యవధిలో డిజిటల్ కార్డు జారీ అవుతుంది. వీటిని డిజి లాకర్‌లోనూ భద్రపరచుకోవచ్చు. ప్లాస్టిక్ కార్డుపై ముద్రించుకోవచ్చు. ప్రభుత్వం సరికొత్త నిర్ణయంతో డ్రైవింగ్ లైసెన్సులు, ఆర్సీ కార్డులు పొందేవారికి ఫీజు భారం తగ్గడంతోపాటు, జారీ సులభతరం అవుతుండటంతో వాహనదారులకు ఊరట లభించనుంది.

త్వరగా కార్డుల జారీ



కొన్ని నెలలుగా వాహనదారులకు ఆర్సీ, డీఎల్ కార్డుల జారీ మందగించింది. వాహనదారులు ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో కార్డులు త్వరగా అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో నెల రోజుల్లో 15 వేలకుపైగా కార్డులు ముద్రించాం. రోజుకు 500 కార్డుల ముద్రణ సామర్థ్యంతో జిల్లా కార్యాలయంలో ప్రింటర్లు పనిచేస్తున్నాయి. కొత్త నిబంధనల మేరకు ఇకపై డిజిటల్ రూపంలోనే కార్డుల జారీ ఉండనుంది. ఇది వాహనదారులకు ఎంతో మేలు చేయనుంది.

– టీకే పరంధామరెడ్డి, జిల్లా రవాణా శాఖ అధికారి, పల్నాడు

పేదలకు నాణ్యమైన వైద్యం

- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- వినుకొండలో అత్యవసర చికిత్స భవనం ప్రారంభం
- రూ.2.10 కోట్లతో నిర్మాణం



అత్యవసర విభాగాన్ని ప్రారంభిస్తున్న మంత్రి రజిని, ఎమ్మెల్యే బొల్లా, మాజీ ఎమ్మెల్యే మక్కెన తదితరులు

వినుకొండ(నూజెండ్ల) : వినుకొండ పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో రూ.2.10 కోట్లతో నిర్మించిన అత్యవసర చికిత్స విభాగం భవనాన్ని మంగళవారం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోనూ వైద్యసేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ వంటి వినూత్న కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. ఇటీవల చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతంగా నడుస్తోందని వివరించారు. వినుకొండలో 30 పడకల వైద్యశాలకు అనుసంధానంగా త్వరలోనే 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామన్నారు. పల్నాడు జిల్లాలో రూ.500 కోట్లతో పిడుగురాళ్ల వద్ద మెడికల్ కళాశాల నిర్మాణంలో ఉన్నట్లు చెప్పారు. మార్కాపురంలో రూ.475 కోట్లతో త్వరలోనే మెడికల్ కళాశాలను అందుబాటులోకి తెస్తామన్నారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ సహకారాలతో ఆరోగ్య శాఖ మంత్రి పర్యవేక్షణలో వినుకొండలో ట్రామా కేర్ సెంటర్, వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తామన్నారు. వినుకొండ అభివృద్ధిలో పాలుపంచుకున్న మంత్రి రజినికి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఆస్పత్రిని బందెలదొడ్డిగా మార్చారని, పందులు సంచరిస్తున్న ఆస్పత్రిని అభివృద్ధి చేసి మూడుసార్లు అవార్డులు అందుకున్న ఆస్పత్రిగా రికార్డు సృష్టించామన్నారు. ఈపూరు మండలంలో రూ.6 కోట్ల నిధులతో నూతన ఆస్పత్రి నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్, డీఎం అండ్‌హెచ్‌వో పి.రవి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ఆరె సామ్రాజ్యం, మార్కెట్‌యార్డు చైర్మన్లు బత్తుల వెంకటేశ్వర్లుయాదవ్, చుండూరి వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ విజయలక్ష్మి రాజా, జిల్లా కో–ఆప్షన్ మెంబరు గుండాల స్వెనోమ్, మున్సిపల్ వైస్ చైర్మన్ తెల్లాకుల రాజేష్‌ఖన్నా, పట్టణ పార్టీ అధ్యక్షులు పీఎస్ ఖాన్, మండల పార్టీ అధ్యక్షులు దండు చెన్నయ్య, వార్డు కౌన్సిలర్లు పాపసాని బ్రహ్మయ్య, ఎంఎస్‌కే బాషా, రెడ్డి నాగపద్మ, కొత్త మాసు శివ, ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అబ్దుల్ రజాక్, డాక్టర్ లీలానందిని, డాక్టర్ సౌమ్య పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని వేదికపై ఎమ్మెల్యే బొల్లా, జేసీ శ్యామ్‌ప్రసాద్

రాయల్టీ లెక్క..ఇక పక్కా

- ప్రైవేట్‌కు వసూలు బాధ్యత
- రెండేళ్ల కాంట్రాక్ట్ దక్కించుకున్న ఏఎంఆర్
- నెలకు రూ.10.50 కోట్లు ప్రభుత్వానికి
- ఇప్పటికే రాష్ట్రంలో ఆరు జిల్లాల్లో అమలు
- 30 శాతం పెరిగిన రాబడి
- అక్రమాలకు తావు లేకుండా కొత్త విధానం



లారీలతో తరలిస్తున్న గ్రానైట్ రాళ్లు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: రాయల్టీ పక్కాగా వసూలుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని బాపట్ల జిల్లాలో గ్రానైట్‌తో పాటు గ్రావెల్, రోడ్డుమెటల్, సిలికా, ఎర్రమట్టి నిత్యం రవాణా సాగుతోంది. బాపట్ల జిల్లా పరిధిలో రేపల్లె, వేమూరు, బాపట్ల, అద్దంకి, పర్చూరు, చీరాల ప్రాంతాల నుంచి గ్రానైట్‌తో పాటు గ్రావెల్, మరం, మట్టి, మెటల్, సిలికా తదితర రవాణా చేస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండిపడకుండా చూసేందుకు రాయల్టీ వసూలు బాధ్యతలను ప్రైవేటుకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఏఎంఆర్‌కు వసూలు బాధ్యత..

రాయల్టీ వసూలుకు ప్రభుత్వం ఆన్‌లైన్ టెండర్లు పిలిచింది. టెండర్లలో పాల్గొన్న ఏఎంఆర్ కంపెనీ టెండర్ దక్కించుకుంది. ఇప్పటికే రాష్ట్రంలోని శ్రీకాకుళం, విజయనగరం, ఈస్ట్ గోదావరి, వైఎస్సార్ కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లోను ఇదే విధానాన్ని కొనసాగిస్తున్నారు. తాజాగా ఉమ్మడి గుంటూరు జిల్లాను ఏఎంఆర్ ఇండియా లిమిటెడ్ కంపెనీకి అప్పగించారు. టెండర్ కాంట్రాక్ట్ కాలపరిమితి రెండేళ్లు కాగా ఇందుకుగాను కంపెనీ ప్రభుత్వానికి రూ.252.10 కోట్లు చెల్లించాలి. ఈ లెక్కన నెలకు రూ.10, 54, 41, 667 చెల్లించాల్సి ఉంది. ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాతిపదికన టెండర్లు ఖరారు చేయగా ప్రస్తుత బాపట్ల జిల్లాలోని రేపల్లె, వేమూరు, బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గాలు దీని పరిధిలోకి వచ్చాయి. ఈ విధానం వలన గతంలో వస్తున్న రాబడితో పోల్చితే ప్రభుత్వానికి 30 శాతం అదనంగా ఆదాయం సమకూరుతున్నట్లు మైనింగ్ అధికారులు చెబుతున్నారు.

నిబంధనలు ఇలా..

తాజా నిబంధనల ప్రకారం ఇప్పటికే మైనింగ్ విభాగం ద్వారా క్వారీ అనుమతులు ఉన్నవారు గ్రానైట్, మెటల్, గ్రావెల్ తరలింపు కోసం మైనింగ్ శాఖ ద్వారా తాము తరలించబోయే క్వాంటిటీకి సంబంధించి ఏఎంఆర్ కంపెనీకి రాయల్టీ చెల్లించి వారి వద్ద నుంచి బిల్లులు తీసుకోవాల్సి ఉంటుంది. తరలింపు సమయంలో సదరు బిల్లులను ఏఎంఆర్ ఏర్పాటు చేసిన చెక్ పోస్టులలో చూపించి మెటీరియల్ లేదా ఇతరత్రా వాటిని తరలించవచ్చు.

రాయల్టీ ఇలా...

గ్రానైట్, మెటల్ ఇతరత్రా వాటికి క్యూబిక్ మీటర్ పద్ధతిలో రాయల్టీ, జీఎస్టీ, ఐటీలు చెల్లించాల్సి ఉంటుంది. రోడ్డు మెటల్, రఫ్‌స్టోన్‌లకు రూ.209 చెల్లించాల్సి ఉండగా గ్రావెల్, మరం, చిప్స్ తదితర వాటికి రూ.105, గ్రానైట్‌కు రూ.4,728 చెల్లించాల్సి ఉంది. గ్రానైట్ సైజు బట్టి రేటుమారుతుంది. ఇది కాకుండా జీఎస్టీ, ఐటీ అదనంగా చెల్లించాల్సి ఉంది.

చెక్‌పోస్టులు

రాయల్టీ వసూలు కోసం ఏఎంఆర్ కంపెనీ జిల్లాలోని పెనుముడి, పేటేరు, చందోలు, కర్లపాలెం, రెడ్డిపాలెం, వెదుళ్లపల్లి ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసింది. ఇవి కాకుండా మొబైల్ టీములను ఏర్పాటు చేశారు.

ముందస్తుగానే ఆదాయం



మైనింగ్ విభాగానికి అధికారులు, సిబ్బంది తక్కువగా ఉన్నందున పర్యవేక్షణ కొంత ఇబ్బందిగా మారింది. గ్రానైట్, ఇతర మెటీరియల్ రవాణాలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. రాయల్టీ వసూలు ప్రైవేటు కంపెనీకి అప్పజెప్పడంవల్ల ప్రభుత్వానికి ముందస్తుగానే నెలకు రూ.10 కోట్ల పైనే ఆదాయం సమకూరుతుంది. పైగా గతంతో పోలిస్తే 30 శాతం రాబడి పెరిగింది.

– రాజేష్, జిల్లా మైనింగ్ అధికారి

రబీ సాగుకు సమాయత్తంపై వర్క్‌షాప్

గుంటూరు రూరల్: రైతులను రబీ సాగుకు సమాయత్తం చేయాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి కోరారు. నగర శివారుల్లోని లాంలోని వర్సిటీ సమావేశ మందిరంలో రబీ సాగు సమాయత్తంపై వర్క్‌షాపు మంగళవారం నిర్వహించారు. సమావేశానికి విస్తరణ సంచాలకుడు డాక్టర్ ఎ.సుబ్బరామిరెడ్డి అధ్యక్షత వహించారు. వీసీ మాట్లాడుతూ ఉష్ణోగ్రతలలో తేడాల వలన, అకాల వర్షాల వలన చీడపీడల ఉధృతి పెరగవచ్చని తెలిపారు. శాస్త్రవేత్తలు సరైన సమయంలో కచ్చితమైన సాంకేతిక సలహాలను వ్యవసాయ శాఖ అధికారులకు, ఆర్‌బీకే సిబ్బందికి, రైతులకు అందించాలని సూచించారు. పరిశోధన సంచాలకురాలు డాక్టర్ ఎల్.ప్రశాంతి మాట్లాడుతూ విస్తరణ శాస్త్రవేత్తలు పరిశోధన అంశాలను పొలాల్లో పరిశీలించి స్పష్టమైన అభిప్రాయాలను పరిశోధన శాస్త్రవేత్తలకు అందించాలని చెప్పారు. కార్యక్రమంలో భారత వ్యవసాయ పరిశోధన మండలి ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్‌వీ సాయిప్రసాద్, డాక్టర్ పి.సంజనారెడ్డి, డాక్టర్ టి.భూపతి, రబీ పంటల్లో సమాయత్తంపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ బాలునాయక్, జేడీఏ కృపాదాస్ పాల్గొన్నారు.



చూసిన కనులదే ధన్యం

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా క్రోసూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు మంగళవారం ధనలక్ష్మి అలంకరణలో భక్తులను కటాక్షించారు. రూ.45 లక్షల కరెన్సీ నోట్లతో సుందరంగా తీర్చిదిద్దిన అమ్మ దివ్య మంగళ స్వరూపాన్ని భక్తులు తిలకించి పులకించారు. సాయంత్రం జరిగిన బతుకమ్మ ఉత్సవం, ప్రత్యేక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

– క్రోసూరు

ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ జిల్లా సమన్వయకర్త కార్యాలయం పరిధిలో వైద్య ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానించనున్నట్లు వైద్య విధాన పరిషత్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ సుబ్రహ్మణ్య రాజు మంగళవారం తెలిపారు. ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, రేడియోగ్రాఫర్, థియేటర్ అసిస్టెంట్, జనరల్ డ్యూటీ అటెండెంట్, పోస్టుమార్టం అసిస్టెంట్ ఉద్యోగాలకు అర్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఆవరణలోని జిల్లా ఆస్పత్రుల సమన్వయ కార్యాలయంలో అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు గుంటూరు.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో సంప్రదించాలని కోరారు.

ఎస్ఎస్ఆర్-24పై రాజకీయపార్టీల ప్రతినిధుల సూచనలు స్వీకరణ

నరసరావుపేట: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం సాయంత్రం గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులతో నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీవో ఎం .శేషిరెడ్డి సమావేశం నిర్వహించారు. ఎస్ఎస్ఆర్–2024లో భాగంగా ప్రీ రివిజన్ యాక్టివిటీస్, డెత్, డూప్లికేటెడ్, షిఫ్టెడ్ ఓటర్ల తొలగింపు తదితర అంశాలను గురించి వారికి వివరించారు. వారి నుంచి సూచనలు, సలహాలు స్వీకరించారు. రొంపిచర్ల, నరసరావుపేట తహసీల్దార్లు అంకారావు, ఆర్వీ రమణానాయక్ పాల్గొన్నారు.

రైతులు సహకరిస్తేనే భూ రీసర్వే వేగవంతం

గురజాల ఆర్డీవో అద్దయ్య


దామరపాడు రైతులకు పొలం హద్దులను వివరిస్తున్న గురజాల ఆర్డీవో అద్దయ్య, తహసీల్దార్ కట్టేకోట పుల్లారావు

రెంటచింతల: ఎన్నో దశాబ్దాల నుంచి నెలకొన్న భూ వివాదాలను పరిష్కరించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ రీసర్వేకు వచ్చిన బృందాలకు రైతులు సహకరించినప్పుడే వేగవంతమవుతుందని గురజాల ఆర్డీవో అద్దయ్య అన్నారు. మంగళవారం మండలంలోని దామరపాడు గ్రామంలో చేపట్టిన 1126 ఎకరాలకు సంబంధించి భూ రీసర్వే భూములను ఆయన తహసీల్దార్ కె.పుల్లారావుతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం 100 సంవత్సరాల అనంతరం ఈ సమగ్ర భూ రీసర్వేను ప్రతిష్టాత్మకంగా చేపట్టడం జరిగిందన్నారు. భూ రీ సర్వే చేసే బృందాలలోని సభ్యులైన గ్రామ వీఆర్వోలకు, సచివాలయ సిబ్బందికి, గ్రామ సర్వేయర్లుకు శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. భూ వివాదాలను పరిష్కరించడమే లక్ష్యంగా ఓఆర్ఐ మ్యాప్ ఆధారంగా చేపట్టిన ఈ భూ రీసర్వేను సకాలంలో పూర్తి చేయాలన్నారు. మూడు దశలలో పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టిన ఈ సర్వే ప్రక్రియలో ముందుగా డ్రోన్స్, ఓఆర్ఐ పరికరాలు, రోవర్లు, సర్వే రాళ్ల సమకూర్చుకుని నాలుగు కీలక పనులను పూర్తిచేస్తారన్నారు. రైతులు వారివారి భూముల వద్దకు వెళ్లి రీ సర్వే బృందాలకు వారి భూముల సరిహద్దు రాళ్లను చూపించి సహకరించాలని కోరారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ తోట సుధాకర్, గ్రామ వీఆర్వోలు కె.బాలయ్య, పల్లా రామకృష్ణ, టి. లింగయ్య, సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఓబీసీ మహిళలకు రిజర్వేషన్‌లు కల్పించాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు



రేపల్లె: మహిళా రిజర్వేషన్‌ల బిల్లులో ఓబీసీ మహిళలకు దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. పట్టణంలోని శారద ఐటీఐ కళాశాలలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. దేశ చరిత్రలో మహిళా రిజర్వేషన్ బిల్లు అత్యధిక మెజార్టీతో ఆమోదం పొందటం అభినందనీయమన్నారు. మహిళా సాధికారికతకు సమగ్రమైన రూపకల్పనగా బిల్లును రూపొందించకపోవటం శోచనీయమన్నారు. బిల్లులో పొందుపరిచిన విధంగా దేశవ్యాప్తంగా ఓబీసీ, మైనార్టీ, ఎస్సీ మహిళలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. 2026లో జరిగే జనగణనలో ప్రత్యేకంగా బీసీ జనగణన చేయాలన్నారు. లేనిపక్షంలో జన గణనను బీసీ సంఘాలు వ్యతిరేకిస్తాయన్నారు. సమావేశంలో బీసీ సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షుడు కుమ్మర క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

అధిక మోతాదులో బెల్లం విక్రయాలు జరపవద్దు

డీఎస్పీ పల్లపురాజు

గురజాల: తెలంగాణ రాష్ట్ర ఎన్నికలను పురస్కరించుకుని బెల్లం వ్యాపారులు అధిక మోతాదులో విక్రయాలు జరపవద్దని డీఎస్పీ పల్లపురాజు సూచించారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం రాత్రి బెల్లం హోల్‌సేల్ వ్యాపారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎవరైనా అధిక మోతాదులో బెల్లం కొనుగోలు చేయడానికి వస్తే వెంటనే మా దృష్టికి తీసుకురావాలన్నారు. తెలంగాణ సరిహద్దులో ఉండడం వలన జాగ్రత్త వహించాలన్నారు. ఎవరైనా అధిక మోతాదులో విక్రయించినా, కొనుగోలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డివిజన్ పరిధిలోని గురజాల సీఐ తాటికొండ బాలకృష్ణ, సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐ అశోక్, బి అనంతకృష్ణ, డివిజన్ పరిధిలోని ఎస్ఐలు, బెల్లం హోల్‌సేల్ వ్యాపారులు, పాల్గొన్నారు.

టెండర్ల ద్వారానే ఆర్టీసీ ఖాళీ స్థలాలు కేటాయింపు

త్వరలో మరికొన్నింటికి టెండర్లు

నరసరావుపేట: స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో ఉన్న ఖాళీ స్థలాల్లో వ్యాపారం చేసుకునేందుకు 33 ఏళ్లు, 15 ఏళ్లు, ఐదేళ్ల కాలపరిమితిలో పారదర్శకంగా టెండర్లు పిలిచి ఎక్కువ అద్దె చెల్లిస్తామనే వారికి ఇవ్వడం జరిగిందని డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి మంగళవారం వెల్లడించారు. మరికొన్ని షాపులకు 15 ఏళ్లు, ఐదేళ్ల ప్రాతిపదికన త్వరలో టెండర్లు పిలవటం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న వ్యాపారస్తులు ఈ టెండర్లలో పాల్గొనాలని కోరారు.

హత్య కేసులో నిందితుడికి యావజ్జీవం

తెనాలిరూరల్: హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దుగ్గిరాల మండలం చిలువూరుకు చెందిన కాబోతు పూర్ణశేఖర్ 2019 మే 14వ తేదీన వైన్ షాప్‌వద్ద మద్యం తాగుతుండగా అతని బంధువు సన్నెకంటి నరేష్‌బాబు అలియాస్ నరేష్ అక్కడికి వచ్చి తనకు మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అందుకు అతను నిరాకరించడంతో ఘర్షణ పడి పక్కనే ఉన్న బీరు సీసాను పగులగొట్టి గొంతులో పొడవడంతో పూర్ణశేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసును దుగ్గిరాల పోలీసులు నమోదు చేయగా అప్పటి తెనాలి రూరల్ సీఐ యు. సుధాకరరావు కేసు దర్యాప్తు చేసి నిందితుడిని కోర్టులో హాజరు పరిచారు. కేసు మంగళవారం విచారణకు రావడంతో సాక్షాధారాలను పరిశీలించిన 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.మాలతి, నిందితుడు నరేష్‌కు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, రూ. వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలన్నారు. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పబ్లిక్‌ప్రాసిక్యూటర్ దాట్ల మోహన్‌రెడ్డి వాదించారు.

అనుమతులు లేని జీవ ఎరువులు స్వాధీనం


అధికారులు స్వాధీనం చేసుకున్న బయో ఉత్పత్తులు

మేదరమెట్ల: అనుమతులు లేని బయో ఉత్పత్తులను అమ్ముతున్న వ్యక్తిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం కేసు నమోదు చేశారు. వివరాలు.. కొరిశపాడు మండలంలోని మేదరమెట్లలో గొంగోలు ధనుంజయ, ఆర్గానిక్ అండ్ నాచురల్స్ పేరుతో ఉత్పత్తులు తయారు చేస్తున్నాడు. వీటికి అనుమతులు లేవు. దీంతో అధికారులు తనిఖీ నిర్వహించి రూ.22.93 లక్షల విలువ చేసే బయో స్టిములెంట్స్(జీవ ఉత్ప్రేరకాలు)ను స్వాధీనం చేసుకున్నారు. 6–ఏ కేసు నమోదు చేశారు. తనిఖీలలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అగ్రికల్చర్ ఆఫీసర్ కే రమణ కుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రయ్య, స్థానిక వ్యవసాయాధికారి శ్రీనివాసరావు ఉన్నారు.

27న ఓటర్ల ముసాయిదా జాబితా

- ఏఈఆర్‌ఓలు ప్రత్యక్షంగా పరిశీలించాలి
- గుంటూరు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశం


అధికారులతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: క్షేత్ర స్థాయిలో బీఎల్ఓలు చేసిన ఇంటింటి సర్వేలో సేకరించిన ఫారాలను ఏఈఆర్‌ఓలు ప్రత్యక్షంగా పరిశీలించాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్‌ఓ కీర్తి చేకూరి ఆదేశించారు. మంగళవారం కమిషనర్ చాంబర్‌లో ఎన్నికల విభాగ విధుల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ నెల 27కి ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల కానున్నదని, నగరంలోని రెండు నియోజక వర్గాల్లో బీఎల్‌ఓలు ఇంటింటి సర్వేలో వచ్చిన ఫారాలను ఏఈఆర్‌ఓలు నేరుగా పరిశీలించాలన్నారు. ఫారాల్లో తప్పనిసరిగా అర్జీదారు, బీఎల్‌ఓ, సూపర్‌వైజర్ అధికారి సంతకాలు, రిమార్క్స్ ఉండాలన్నారు. పోలింగ్ స్టేషన్ల వారీగా ఏమైనా అర్జీలు ఆన్ లైన్ చేయకుండా పెండింగ్ ఉంటే వాటిని వెంటనే పూర్తి చేయాలన్నారు. ఎన్నికల విధులు ఎంతో అప్రమత్తంగా నిర్వహించాలని, నిర్లక్ష్యంగా ఉండే వారి పై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. పెండింగ్ ఫారాలను ఈ నెల 27 తర్వాత ఆన్ లైన్ చేయాల్సి ఉంటుందని, అందుకు తగిన విధంగా సూపర్‌వైజరి అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ (ఇన్‌చార్జి) సి.హెచ్.శ్రీనివాస్, డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, డెప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య, సూపరింటెండెంట్లు సాంబశివరావు, ప్రసాద్, పద్మ పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వండి : ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

నగరంపాలెం: మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ తెలిపారు. పశ్చిమ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను పరిశీలించి, పెండింగ్‌లో ఏవైనా కేసులు ఉన్నట్లతే త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని ఎస్పీ సూచించారు. గుంటూరు నగరంలో రద్దీగా ఉన్న ప్రాంతాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు తీసుకోవల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన నూతన విధివిధానాలపై ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులతో ఎస్పీ మాట్లాడారు. ఎస్పీ మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడిపితే జరిగే ప్రమాదాలను కౌన్సెలింగ్‌కు వచ్చే తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అన్నారు.

మాతృమరణాలు ఎక్కడా జరగకుండా చూడండి

అధికారులతో సమీక్ష చేసిన డీఎంహెచ్‌వో డాక్టర్ పి.రవి


మాతృ మరణాలపై అధికారులతో వెబెక్స్ ద్వారా సమీక్ష చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ రవి

నరసరావుపేట: జిల్లాలో ఎక్కడా మాతృ మరణాలు జరగకుండా జాగ్రత్తలు వహించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవి అధికారులకు సూచించారు. మంగళవారం మాతృ మరణాలపై రివ్యూ మీటింగ్ వెబెక్స్ ద్వారా తన కార్యాలయం నుంచి నిర్వహించారు. మీటింగ్‌లో చంద్రాజుపాలెం, నాదెండ్ల, యడ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలలో సంభవించిన మూడు మాతృ మరణాలపై సమీక్షించారు. కాన్పులు చేసిన వైద్యాధికారులు, ప్రైవేటు వైద్యశాల నుంచి హాజరైన గైనకాలజిస్ట్, మత్తు వైద్యులు, చిన్నపిల్లల వైద్యులను విచారించి మరణాలకు దారి తీసిన కారణాలను తెలుసుకున్నారు. భవిష్యత్తులో ఈవిధమైన మరణాలు జరగరాదన్నారు. గర్భిణులు పోషకాహారం తీసుకునే విధంగాను, తగిన సమయానికి పరీక్షలు అనగా హిమోగ్లోబిన్ శాతం, గర్భస్థ శిశువు కదలికలను తెలుసుకునేందుకు ఆరోగ్యశ్రీ పథకం కింద ఏర్పాటు చేయబడిన ఉచిత అల్ట్రా సోనోగ్రఫీ, టిఫ్ఫా పరీక్షలను చేయించుకునే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. జిల్లా ప్రభుత్వ వైద్యశాలల పర్యవేక్షణాధికారి డాక్టర్ బీవీ రంగారావు, డెప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జి.చంద్రశేఖర్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి, డాక్టర్ నాగపద్మజ, సూపరింటెండెంట్ డాక్టర్ మంత్రు నాయక్, డాక్టర్ వసంతరాయ, డాక్టర్ సింధూజ, ఆర్ఎంవో డాక్టర్ దయానిధి, జీజీహెచ్ హెచ్‌వోడీ డాక్టర్ జయంతి, ఐసీడీఎస్ పీడీ అరుణ, డీపీహెచ్ఎన్‌వో బి.సురేఖ, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాయకుల్లో మళ్లీ చైతన్యం తెచ్చేందుకు సమావేశం

డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి

నరసరావుపేట: నియోజకవర్గంలో 2014, 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి తోడ్పాటు అందించి కొన్ని రోజులుగా రాజకీయ కార్యకలాపాలకు దూరంగా ఉన్న పాత కాంగ్రెస్ నాయకుల్లో మళ్లీ చైతన్యం తీసుకొచ్చి పార్టీ విజయానికి కృషి చేసేందుకు అంతర్గత సమావేశం నిర్వహించాల్సి వచ్చిందని బాపట్ల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకులు, స్థానిక సీనియర్ నాయకులు డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి వెల్లడించారు. దీనిపై పచ్చమీడియాకు చెందిన ఒక పత్రికలో రీజినల్ కో–ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి ఆశీస్సులతో స్థానిక ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా అసమ్మతివాదులతో తాను రహస్య సమావేశం నిర్వహించినట్లు వచ్చిన వార్తను ఆయన ఖండించారు. మంగళవారం సాక్షి విలేకరితో ఆయన మాట్లాడుతూ తమ సమావేశం కేవలం ఒక గంటపాటే జరిగిందన్నారు. దీనికి కాంగ్రెస్ పార్టీ మాజీ మహిళా మున్సిపల్ చైర్మన్, ఆమె భర్త, మాజీ కాంగ్రెస్ కౌన్సిలర్లు హాజరయ్యారన్నారు. తనతోపాటు ప్రస్తుతం పార్టీలో యాక్టీవ్‌గా ఉన్న ఇద్దరు ప్రజాప్రతినిధులు హాజరయ్యారన్నారు. తమ సమావేశంలో ఎక్కడా విజయసాయిరెడ్డి పేరు ప్రస్తావనకు రాలేదన్నారు. విజయసాయిరెడ్డి నరసరావుపేటకు వచ్చిన తర్వాత పార్టీలో ఉత్సాహం పెరిగిందన్నారు. ఆయన వచ్చిన సమయంలో పాత కాంగ్రెసు వాదులకు కూడా పిలుపు రావటంతో వారందరూ ఉత్సాహంగా ఉన్నారన్నారు. అందరూ కలిసి పార్టీకి పనిచేయాలని సూచించటం జరిగిందన్నారు.

పంటలు ఎండిపోవటానికి విద్యుత్ కారణం కాదు

- రైతులకు తొమ్మిది గంటలపాటు విద్యుత్ సరఫరా చేస్తున్నాం
- ఓ పత్రిక కథనాన్ని ఖండించిన విద్యుత్‌శాఖ ఈఈ శ్రీనివాసరావు

నరసరావుపేట: పంటలు నీరు లేక ఎండిపోయాయేకాని తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేయకపోవటం వలన కాదని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ ఎస్.శ్రీనివాసరావు మంగళవారం పేర్కొన్నారు. ఈనెల 14న ఓ దినపత్రికలో (సాక్షికాదు) తొమ్మిది గంటల విద్యుత్ ఉత్తమాటలే నంటూ వచ్చిన కథనాన్ని ఆయన ఖండించారు. దీనిపై ఆయన వివరణ ఇచ్చారు. ఈ కథనంలో వాస్తవం లేదన్నారు. ఎల్‌నినో కారణంగా ఈ ఏడాది జూన్ నుంచి వర్షాలు సక్రమంగా పడలేదన్నారు. దీంతో సాగర్‌లో నీటి పరిమాణం లేక ఆయకట్టుకు సాగు నీరు విడుదల చేయలేదన్నారు. మెట్ట ప్రాంత రైతులు నీటి కోసం బోర్లపై ఆధారపడ్డారన్నారు. భూగర్భంలో నీరులేక తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా చేసినా నీరు సక్రమంగా భూగర్భం నుంచి రాక పంటలు తడవక ఎండిపోతున్నాయన్నారు. వాతావరణంలో వేడి పరిమాణం పెరగటంతో విద్యుత్ ఉత్పత్తి, వాడకంలో అధిక వ్యత్యాసం వచ్చిందన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం అధిక ధరలకు కొనుగోలు చేసి వ్యవసాయ రంగానికి తొమ్మిది గంటలపాటు విద్యుత్ సరఫరా చేస్తుందన్నారు.

దసరాకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

మాచర్ల: దసరా పండుగ పురస్కరించుకొని రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలలకు సెలవులు ప్రకటించిన నేపథ్యంలో విద్యార్థుల సౌకర్యార్థం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మాచర్ల డిపో నుంచి 16 అదనపు సర్వీసులు నడుపుతున్నట్లు డీఎం పిచ్చయ్య మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 20న నాలుగు బస్సులు, 21న నాలుగు, 22న రెండు, 23న రెండు బస్సులు చొప్పున మొత్తం 12 ప్రత్యేక బస్సులను సాధారణ ఛార్జీలతో నడపనున్నట్లు తెలిపారు. రద్దీ ఎక్కువగా ఉంటే అవసరమైతే సర్వీసుల సంఖ్య పెంచనున్నట్లు తెలిపారు. రానుపోను ఒకేసారి బుక్ చేసుకున్న ప్రయాణికులకు 10శాతం చొప్పున రాయితీ ఇచ్చినట్లు తెలిపారు. సురక్షిత ప్రయాణం కోసం ప్రయాణికులు ఆర్టీసీలో ప్రయాణించాలన్నారు.


చోరీ చేసి దొరికిపోయిన నిందితుడు

తక్కువ సమయంలో కేసును ఛేదించిన పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ పోతురాజు, సీఐ వాసు

మేడికొండూరు: మండల పరిధిలోని భీమినేని వారి పాలెంలో ఈనెల 10న పట్టపగలు ఓ ఇంట్లో చోరి జరిగింది. గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి ప్రవేశించి మహిళలపై దాడి చేశారు. బీరువాలో ఉన్న నగదు అపహరించుకు పోయారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు తక్కువ సమయంలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తుళ్లూరు డీఎస్పీ పోతురాజు మంగళవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నిందిగుడి నుంచి మూడు రాబరి, ఐదు ద్విచక్ర వాహనాల చోరీతోపాటు, పాటేలు చోరీ కేసులు ఉన్నట్లు తెలిపారు. నేర చరిత్ర ఉన్న వ్యక్తిగా వెల్లడించారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణంలోని లెనిన్ కాలనీకి చెందిన కె.దుర్గాప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. మరో వ్యక్తి పిడుగురాళ్ల ఆదర్శ కాలనీకి చెందిన శేషగిరి అలియాస్ ఎలిషా పరారీలో ఉన్నట్లు, అతని కోసం పోలీసులు గాలిస్తున్నట్లు వెల్లడించారు. చోరీ జరిగిన వారం రోజుల్లోపు కేసును చేధించడంలో ప్రతిభ కనబర్చిన మేడికొండూరు సీఐ వాసు, ఎస్సై మధుపవన్, పీసీలు జి.సిద్ధయ్య, వై.మాణిక్య రావు, షేక్ నజీర్, ఒ.డేవిడ్, కె.రామారావు, కానిస్టేబుళ్లను గుంటూరు ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ అభినందనలు తెలిపి రివార్డులు ప్రకటించారు. రివార్డులు డీఎస్పీ పోతురాజు పంపిణీ చేశారు.

పూడ్చిన వివాహిత మృతదేహానికి పోస్టుమార్టం


మృతురాలు పాలపర్తి నాగమణి (ఫైల్)


మృతదేహాన్ని వెలికి తీస్తున్న అధికారులు

జే పంగులూరు: సమాధి నుంచి వివాహిత మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించిన ఘటన మండల పరిధిలోని కల్లంవారిపాలెంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాలు.. గ్రామానికి చెందిన పాలపర్తి సాంబశివరావు, పల్నాడు జిల్లాలోని నకరికల్లుకు చెందిన మొగలి ఏసుబాబు, సామ్రాజ్యం మొదటి కుమార్తె నాగమణి (26)ని ఆగస్టు 2023లో ఆమె ఇంటి వద్ద వివాహం చేసుకున్నాడు. ఇద్దరికి రెండో పెళ్లి. అనంతరం ఇద్దరు అదే రోజు పెళ్లి కుమారుడి గ్రామానికి వచ్చారు. మూడో రోజు పెళ్లి కుమార్తె ఇంటికి వెళ్లారు. ఆ రాత్రి గడిచిన తరువాత మరుసటి రోజు పెళ్లి కూతురు పాలపర్తి నాగమణి(26)కి వాంతులు అయ్యాయి. తల్లిదండ్రులు వెంటనే స్థానిక ఆర్ఎంపీ వద్ద రెండు రోజుల పాటు వైద్యం చేయించారు. కొంత కుదుటపడిన తరువాత ఇంటికి బోరింగ్ వద్ద మంచినీరు తీసుకొస్తూ కుప్పకూలి పడిపోయింది. వెంటనే బంధువులు నరసరావుపేట ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్య నిమిత్తం గుంటూరు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సెప్టెంబర్ 5న చనిపోయింది. మృతదేహాన్ని అందరి సమక్షంలో పెళ్లి కుమారుడి ఊరు అయిన కల్లంవారిపాలెంలో ఖననం చేశారు. కూతురు చనిపోయిన నెల తరువాత తల్లిండ్రులు అయిన మొగలి ఏసుబాబు, సామ్రాజ్యం తన కూతురుపై విషప్రయోగం జరిగిందని, మాకు న్యాయం చేయాలని నకరికల్లు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కూతురు చనిపోయిన నెల గడిచిన తరువాత మా వద్ద నుంచి రూ. 2 లక్షలు డిమాండ్ చేశారని, అవి ఇవ్వక పోయేసరికి మా మీద అన్యాయంగా కేసు పెట్టినట్లు పెళ్లి కుమారుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అక్కడి పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పాముల సురేష్ పోస్టుమార్టం చేసి, బాడీ నుంచి అంతర్భాగాలు బయటకు తీసి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. పోస్టుమార్టంలో అద్దంకి మెడికల్ ఆఫీసర్ వాహిని చౌదరి, తహసీల్దార్ ఐ పద్మావతి, ఎస్ఐ తిరుపతిరావు, వీఆర్‌ఓ అంజియ్య ఉన్నారు.